

258 కేజీల గంజాయి స్వాధీనం

పాచిపెంట మండలంలో రెండు కార్లలో అక్రమంగా తరలిస్తున్న 258 కేజీల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. - 8లో



ఒడిశా ఆగడాలపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

కొటియా గ్రామాల గిరిజనులపై ఒడిశా ప్రభుత్వ ఆగడాలపై గిరిజన సంఘం నేతలు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. - 8లో



న్యూస్‌రీల్

నేడు అక్షరాస్యత అర్హత పరీక్ష

విజయనగరం అర్బన్: అక్షరాస్యత అర్హత కోసం చేపట్టిన ఉల్లాస్ కోర్సు పరీక్షను ఆదివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నట్టు వయోజన విద్య ఉప సంచాలకులు ఎ.సోమేశ్వరరావు తెలిపారు. జిల్లాలోని 27 మండలాల్లో 48,578 మంది అభ్యాసకులు ఈ పరీక్ష రాయనున్నారు. దీనికోసం 1,051 పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఇన్విజిలేటర్‌గా అంగన్‌వాడీ టీచర్లు వ్యవహరిస్తారు. వయోజన విద్య శాఖకు సంబంధించి రాష్ట్ర పరిశీలకులుగా ఎ.దొరబాబు జిల్లాలో హాజరుకానున్నారు. మండల స్థాయిలో ఎంపీడీఓ, ఏపీఎం వెలుగు, సీడీపీఓ, ఐసీడీఎస్ అధికారులు, గ్రామస్థాయిలో సీసీ వెలుగు, ఐసీడీఎస్ సిబ్బంది పర్యవేక్షిస్తారు.

క్షయ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్, తదితరులు

విజయనగరం ఫోర్ట్: క్షయ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పిలుపునిచ్చారు. ఈనెల 24న ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా తన చాంబర్‌లో శనివారం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. క్షయ వ్యాధిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. వ్యాధి వ్యాప్తి, వ్యాధి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, క్షయ వ్యాధి చికిత్స విధానం తెలియజేయాలని వైద్యసిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవనరాణి, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ కె.రాణి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డులు మాకో లెక్కా?



బోర్డులను పీకేసి, కర్రలు పాతిన ప్రభుత్వ స్థలం

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి చంద్రబాబు కాలనీలో సర్వే నంబర్ 60లోని ప్రభుత్వ స్థలాన్ని కొందరు అక్రమార్కులు చదును చేసి, ఆక్రమణకు ప్రయత్నించిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన రెవెన్యూ, నగర పంచాయతీ అధికారులు సదరు స్థలం ప్రభుత్వానిదని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ 20 రోజుల కిందట ఆ స్థలంలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. అయితే కొంతమంది అక్రమార్కులు తాజాగా వాటిని తొలగించి గుడిసెలు వేసేందుకు కర్రలు పాతడం గమనార్హం. అధికారులు ఎలా స్పందిస్తారో వేచిచూడాల్సిందే.

పోలీస్ శాఖలో 11 మందికి సేవా పతకాలు

విజయనగరం క్రైమ్: రాష్ట్ర పోలీస్ శాఖ ప్రకటించిన ఉగాది పురస్కారాల్లో భాగంగా జిల్లాలో ఉత్తమ సేవలందిస్తున్న 11 మందికి సేవా పతకాలు వరించాయి. స్పెషల్ బ్రాంచ్ ఎస్‌ఐ సత్యనారాయణ, చింతలవలస ఏపీఎస్పీ 5 బెటాలియన్ సిబ్బంది రామకృష్ణారావు, నాగేశ్వరరావు, ఈశ్వరరావు, అప్పలరాజు, బి.నారాయణరావు, హెచ్‌సీ రమణ, గుర్ల పీఎస్‌కు చెందిన అప్పలరాజు, ఆర్‌పీసీ శ్రీనివాసరావు, గోపాలరావు, ఆర్‌హెచ్‌సీ గుర్ల గోవిందంకు పతకాలు లభించాయి. రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున పతకాలు అందజేయనున్నారు.



పోలీస్ యంత్రాంగం అధికారిక లెక్కల ప్రకారం గత రెండేళ్లలో నమోదైన కేసుల వివరాలు ఇలా....

- 2023 సంవత్సరంలో జిల్లాలో బెట్టింగ్‌లకు పాల్పడుతున్న వారిపై రెండు కేసులు నమోదు చేసి, ఐదు మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.4వేలు నగదుతో పాటు 6 మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు.
- 2024 సపంవత్సరంలో మరో 2 కేసులు నమోదు చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.18,500 నగదు, ఒక ల్యాప్‌టాప్, 6 మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. అయితే, పోలీసులకు చిక్కకుండా రూ.కోట్లలో బెట్టింగ్‌లు సాగుతున్నట్టు సమాచారం.

బంతిబంతికీ బెట్టింగ్!

- ప్రారంభమైన ఐపీఎల్ బెట్టింగ్‌లు
- అప్పుల ఊబిలో కూరుకుపోతున్న యువత
- రెండు నెలల వ్యవధిలో చేతులు మారనున్న కోట్లాది రూపాయలు

విజయనగరం:

ఐపీఎల్ పోరు మొదలైంది. రెండు నెలలకు పైగా సాగే ఈ సంగ్రామాన్ని కొందరు వినోదం కోసం చూస్తుండగా.. మరికొందరు సులభంగా ఆదాయం సంపాదించే వనరుగా భావిస్తున్నారు. బంతి బంతికీ బెట్టింగ్ పెట్టి డబ్బు సంపాదించాలని అత్యాశ పడుతున్నారు. ఈ ఊబిలో చిక్కుకొని చేసిన అప్పులు తీర్చలేక చివరకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రధానంగా యువతే ఇందులో బాధితులుగా మారుతున్నారు. ఆఫ్‌లైన్‌తో పాటు ఆన్‌లైన్ మార్గంలోనూ సాగుతున్న పందేలపై దృష్టి సారించాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది.

పల్లెలకూ పాకిన బెట్టింగ్ సంస్కృతి...

బెట్టింగ్ సంస్కృతి గతంలో మహానగరాల్లోనే కనిపించేది. క్రమేణా పట్టణాలు, మండల కేంద్రాలకు పాకింది. ఇప్పుడు పల్లెపల్లెలకూ విస్తరించింది. కొన్నేళ్ల కిందట అందరూ ఓచోట కూర్చుని పందాలు కాసేవారు. తర్వాత కాలంలో పెద్ద మొత్తాల్లో బెట్టింగ్‌లు జరిగేటప్పుడు బుకీల పేర్లు వినిపించేవి. ప్రస్తుతం చాలావరకు ఆన్‌లైన్‌లో ఐపీఎల్ మ్యాచ్‌ల బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. పలు యాప్‌లలో పందాలు కాస్తూ ఈ విష వలయంలో చిక్కుకుంటున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

బెట్టింగ్‌లు చట్ట రీత్యా నేరం. దీనికి పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇందుకు ప్రత్యేక బృందాలను నియమించాం. మంచి భవిష్యత్ కలిగిన యువత బెట్టింగ్‌లు జోలికి పోవద్దు. క్రికెట్‌ను వినోదం కోసమే చూడాలి. ఆత్యాశతో బెట్టింగ్‌లకు వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దు. పిల్లల తీరుపై తల్లిదండ్రులు కూడా ఓ కన్నేసి ఉంచాలి.

– వకుల్ జిందాల్, ఎస్పీ, విజయనగరం జిల్లా

నిందితులపై ఓ కన్నేస్తేనే..

బెట్టింగ్ కేసుల్లో అరెస్టు అయిన నిందితులపై పోలీసులు ఓ కన్నేస్తే కొంతవరకైనా వీటికి అడ్డుకట్ట పడుతుంది. మధ్యవర్తులుగా వ్యవహరించే బుకీల కార్యకలాపాలపైనా దృష్టి సారించాలి. లోతుగా విచారిస్తే సూత్రధారులెవరో స్పష్టంగా తెలుస్తుంది. అవసరమైన పక్షంలో యాప్ నిర్వాహకులపైనా కేసులు నమోదు చేయాలి. పక్క రాష్ట్రమైన తెలంగాణా పోలీసులు ప్రస్తుతం ఈ వ్యవహారంపై ఉక్కుపాదం మోపుతున్నారు. బెట్టింగ్‌లను ప్రోత్సహిస్తున్న సామాజిక మాధ్యమాల ప్రభావశీలురపైనా చర్యలు తీసుకుంటున్నారు. ఇదేవిధంగా ఉమ్మడి విజయనగరం జిల్లాల్లోనూ కఠినంగా వ్యవహరించాలన్న వాదన వినిపిస్తోంది.

ఆస్తుల తాకట్టు..

ఒక్కసారి బెట్టింగ్ వ్యసనానికి బానిసైన వ్యక్తులు బయటపడటం అసాధ్యమవుతోంది. చివరకు ఇళ్లు, స్థలాలు, పొలాలు తాకట్టు పెడుతున్నారు. అయినారుణాలు తీర్చలేని పక్షంలో ఆస్తులు అమ్మి బికారులవుతున్నారు. యువత కార్లు, బైక్‌లు, బంగారం అమ్ముకుంటున్నారు. ఇలా సర్వస్వం కోల్పోతున్నారు. సీజన్ ముగిసే సరికి వెనక్కు తిరిగి చూసుకుంటే రూ. లక్షలు– రూ.కోట్ల అప్పులు కనిపిస్తున్నాయి. వీటిని కట్టలేక, అప్పులు ఇచ్చిన వారికి సమాధానం చెప్పలేక విధిలేని పరిస్థితుల్లో బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.



చేతులు మారనున్న కోట్లాది రూపాయలు

ఐపీఎల్ సాగే ఈ రెండు నెలల్లో ఉమ్మడి జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో రూ.కోట్లలో ధనం చేతులు మారుతుందని అంచనా. జిల్లాలో రూ.20 కోట్ల నుంచి రూ.25 కోట్ల వరకు బెట్టింగ్ జరుగుతున్నట్టు సమాచారం. మ్యాచ్ ముగిసిన క్షణాల వ్యవధిలోనే వివిధ యాప్ ద్వారా నగదు బదిలీ అవుతున్నందున మంచినీళ్లప్రాయంగా పందాలు కాస్తున్నారు. విజయనగరం, బొబ్బిలి, చీపురుపల్లి, గజపతినగరం, నెల్లిమర్ల తదితర ప్రాంతాల్లో విద్యార్థులు ఎక్కువ మంది పందాల ఉచ్చులో చిక్కుకుంటున్నారు.



జంతు ప్రేమ..!

అన్నీ తెలిసిన మనిషి.. అహంకారానికి బానిసగా మారి బంధుత్వాలకు బంధనాలు వేస్తుండగా... ఎటువంటి జ్ఞానం లేని మూగ జీవాలు మాత్రం ప్రేమాభిమానాలు చాటుతున్నాయి. దీనికి ఈ చిత్రమే నిలువెత్తు సాక్ష్యం. రేగిడి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన ముగడ రాము మేకల మందకు కాపలాగా ఉంటుందని ఓ కుక్కపిల్లను పెంచుతున్నాడు. మందలోని ఓ మేక తన పిల్లలతో పాటు కుక్క పిల్లకు పాలిచ్చి సాకుతోంది. జంతుప్రేమను చాటుతోంది.

– రేగిడి

రైతుల ఆందోళన



బొద్దాంలో రోడ్డుపై బైఠాయించిన రైతులు, ట్రాక్టర్ డ్రైవర్లు

వేపాడ: 'మా పొలాల్లో మట్టి మేము తోలుకుంటే మీకెందుకు రూ.లక్ష జరిమానా కట్టాలి.. మా ఆస్తులపై మీ పెత్తనమేమిటి.. మీకు ఆ అధికారం ఎవరిచ్చారు... మీరు టోల్‌గేట్లు పెట్టి దోచుకుంటున్నది ఎవరి సొమ్ము..' అంటూ బొద్దాం చెక్‌పోస్టు వద్ద రైతులు శనివారం ఆందోళనకు దిగారు. రోడ్డుపై బైఠాయించి అక్రమ వసూళ్లపై నిరసన తెలిపారు. బొద్దాం గ్రామానికి చెందిన రైతులు కొందరు తమ పొలాల్లో మట్టిని తీయించి కళ్లాలు కప్పేందుకు తరలిస్తుండగా బొద్దాం చెక్‌పోస్టు అధికారులమంటూ కొందరు రెండు వాహనాల్లో వచ్చి ట్రాక్టర్లు అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా మట్టి తరలించరాదని, రూ.లక్ష జరిమానా కట్టాల్సిందే అంటూ హుకుంజారీచేశారు. దీంతో ఆగ్రహించిన రైతులు వారిని అడ్డుకుని రోడ్డుపై బైఠాయించారు. . మిమ్మల్ని పంపిన వారిని రప్పించండి.. వాళ్లు వచ్చే వరకూ వదిలేది లేదంటూ కూర్చున్నారు. విషయం తెలుసుకున్న వల్లంపూడి ఎస్‌ఐ ఘటనా స్థలానికి చేరుకుని రైతులకు సర్దిచెప్పారు. సమస్యను అధికారులతో మాట్లాడి పరిష్కరించుకోవాలని సూచించారు. దీంతో వాహనాలను, వచ్చిన వారిని వదిలేసి సాయంత్రం 4 గంటల వరకు చెక్‌పోస్టు వద్దే బైఠాయించారు. కార్యక్రమంలో రైతులు, ట్రాక్టర్ల డ్రైవర్లు పాల్గొన్నారు.

భైరిపురాన్ని సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి



భైరిపురం వాసులతో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి చీమలపాటి రవి

మెరకముడిదాం: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్టు పోలియో జడ్జి జస్టిస్ చీమలపాటి రవి తన సొంత గ్రామమైన మెరకముడిదాం మండలం భైరిపురంను శనివారం సాయంత్రం సందర్శించారు. తండ్రి చీమలపాటి శ్రీరామమూర్తి, సోదరుడు శేఖర్‌తో కలిసి గ్రామస్తులతో కాసేపు ముచ్చటించారు. బంధువుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిఒక్కరూ నీతిగా, నిజాయితీగా జీవించాలన్నారు. వివాదాలు, తగాదాలకు దూరంగా ఉంటూ కుటుంబ కలహాలు లేని జీవితాలను గడపాలన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పప్పల కృష్ణమూర్తి, కందుల మల్లికార్జునరావు, సింగారపు రామకృష్ణ, కందుల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. చీపురుపల్లి సీఐ శంకరరావు, బుధరాయవలస ఎస్‌ఐ జె.లోకేష్‌కుమార్ న్యాయమూర్తి రవికుమార్‌కు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

మర్యాదపూర్వక కలయిక





హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్ అంబేడ్కర్, ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం లీగల్: విజయనగరం జిల్లా కోర్టులో శనివారం జరిగిన న్యాయాధికారుల సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవిని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఎస్పీ వకుల్ జిందల్ మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత లేదు

- రాష్ట్ర గవర్నర్‌కు అంబేడ్కర్ ఫోరం రాష్ట్ర కమిటీ ఫిర్యాదు



డీఆర్వో శ్రీనివాసమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న అంబేడ్కర్ ఫోరం ప్రతినిధులు

విజయనగరం అర్బన్: ఎస్సీ వర్గీకరణపై ఏర్పాటు చేసిన రాజీవ్ రంజన్ మిశ్రా నివేదిక పూర్తిగా తప్పులతో కూడినదని అంబేడ్కర్ ఫోరం ఏపీ అధ్యక్షుడు భానుమూర్తి ఆరోపించారు. దీనిని పరిశీలించాలని రాష్ట్ర గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తూ కలెక్టర్‌లోని డీఆర్‌ఓ ఎస్.శ్రీనివాసమూర్తికి శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. 1952 కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీ యాక్ట్ సెక్షన్ 11 ప్రకారం కమిషన్‌ను నియమించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 (1)(2) సవరించే అధికారం పార్లమెంట్‌కు మాత్రమే ఉందన్నారు. డీఆర్వోను కలిసిన వారిలో ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బొంగ భానుమూర్తి, దారాన వెంకటేష్, మల్లాన సత్యనారాయణ, రెల్లి, ఉపకులాల అధ్యక్షుడు సోము మురళీమోహన్ ఉన్నారు.

20.16 లక్షల మొక్కల పెంపకం

- జిల్లా అటవీశాఖ అధికారి ప్రసూన



నర్సరీ నిర్వహణపై అటవీశాఖ అధికారులకు సూచనలిస్తున్న డీఎఫ్‌ఓ ప్రసూన

వీరఘట్టం: జిల్లాలో అటవీ విస్తీర్ణం పెంచేందుకు ఈ ఏడాది 18 నర్సరీల్లో 20.16 లక్షల మొక్కలు పెంచాలన్నది లక్ష్యంగా నిర్ణయించామని జిల్లా అటవీశాఖ అధికారి జి.ఎ.పి. ప్రసూన అన్నారు. వీరఘట్టం మండలం రేగులపాడులో కొత్తగా ఏర్పాటు చేసిన నర్సరీను ఆమె శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. మొక్కల పెంపకం బాధ్యతను అటవీ సెక్షన్, బీట్ ఆఫీసర్లకు అప్పగించామన్నారు. ప్రస్తుతం పాలకొండ రేంజ్ పరిధిలో 20,507 హెక్టార్లు, కురుపాం రేంజ్ పరిధిలో 32,681 హెక్టార్లు, పార్వతీపురం రేంజ్‌లో 26,301 హెక్టార్లు, సాలూరు రేంజ్‌లో 28,230 హెక్టార్లు కలిపి జిల్లా మొత్తం 1,07,719 హెక్టార్లలో అడవులు విస్తరించి ఉన్నాయన్నారు. వన నర్సరీల్లో పెంచే మొక్కలను ఈ ఏడాది జిల్లాలోని పార్వతీపురం, కొమరాడ, గరుగుబిల్లి, సీతానగరం, వీరఘట్టం, సీతంపేట, భామిని, పాలకొండ అటవీ ప్రాంతాల్లో నాటించి అటవీ విస్తీర్ణాన్ని మరింత పెంచేందుకు చర్యలు చేపడుతున్నట్టు వెల్లడించారు. త్వరలో కుంకీ ఏనుగులను తెప్పించి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సంచరిస్తున్న 11 ఏనుగుల గుంపును సీతానగరం మండలం గుచ్చిమి వద్ద ఏర్పాటుచేస్తున్న తాత్కాలిక ఎలిఫెంట్ జోన్‌కు తరలించే ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. ఆమె వెంట పాలకొండ రేంజర్ కె.రామారావు, వీరఘట్టం సెక్షన్ ఆఫీసర్ పి.రవిబాబు, సోషల్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సోమేశ్వరరావు, తదితరులు ఉన్నారు.



క్లుప్తంగా

బోడసింగిపేటలో చోరీ



చోరీకి గురైన దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ

బొండపల్లి: మండలంలోని బోడసింగిపేట గ్రామంలో గిట్టుపల్లి గ్రామానికి వెళ్లే మార్గంలో శనివారం వేకువజామున ఒక దుకాణంలో చోరీ జరిగింది. దుకాణంలో కొంత నగదుతో పాటు విలువైన కిరాణా సామగ్రి అపహరించుకుపోయారు. కనిమెరక గ్రామానికి చెందిన జి.శ్రీనివాస్ గుప్తా బోడసింగిపేటలో కిరాణా దుకాణాన్ని కొన్నాళ్లుగా నడుపుతున్నాడు. రోజులాగే శుక్రవారం రాత్రి దుకాణం మూసి ఇంటికి వెళ్లిపోయాడు. శనివారం ఉదయం వచ్చి చూడగా దుకాణం షట్టర్లు పగులకొట్టి ఉండటాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ యు.మహేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలను సేకరించారు. దుకాణంలో ఉంచిన రూ.12వేల నగదుతో పాటు రూ.13 వేల విలువ చేసే కిరాణా వస్తువులు అపహరించుకుపోయినట్టు బాధితుడు గుప్తా తెలిపాడు.

బెల్లం ఊట ధ్వంసం



స్వాధీనం చేసుకున్న డ్రమ్ములు

సీతంపేట: సీతంపేట ఏజెన్సీలోని కుశిమిగూడ పరిధిలో మూడు వేల లీటర్ల పులిసిన బెల్లం ఊటలు శనివారం ధ్వంసం చేసినట్టు ఎస్‌ఐ వై.అమ్మన్నరావు శనివారం తెలిపారు. సారా వంటకాలు చేస్తున్నారనే సమాచారం అందడంతో దాడులు జరిపినట్టు తెలిపారు. భూమిలో డ్రమ్ములతో పాతి ఉంచిన బెల్లం ఊటలు వెలికి తీసి పారబోసి, డ్రమ్ములు స్వాధీనం చేసుకున్నామన్నారు.

బాసంగిలో గజరాజుల గుంపు



బాసంగి అరటి తోటలో ఉన్న గజరాజుల గుంపు

జియ్యమ్మవలస: మండలంలోని బాసంగి పంట పొలాల్లో గజరాజుల గుంపు శనివారం సాయంత్రం కనిపించాయి. ఉదయం వెంకటరాజపురం, బాసంగి, గదబవలసలో వరి పంటలను ధ్వంసం చేసిన గజరాజులు సాయంత్రానికి బాసంగి పరిసర ప్రాంతాల్లోకి చేరాయి. రాత్రికి మళ్లీ వెంకటరాజపురం, గవరమ్మపేట గ్రామాల్లోకి చొచ్చుకు రావడంతో గ్రామస్తులు భయాందోళనలు చెందుతున్నారు. రబీ వరి పంట ఉభాలు వేసి నెల రోజులు కావడంతో పంటలను ధ్వంసం చేస్తే పూర్తిగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

258 కేజీల గంజాయి స్వాధీనం



మాట్లాడుతున్న సీఐ రామకృష్ణ

పాచిపెంట: మండలంలో రెండు కార్లలో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పట్టుకున్నట్లు రూరల్ సీఐ రామకృష్ణ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద పట్టుబడిన గంజాయిని చూపించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం మధ్యాహ్నం మండలంలో కొటికిపెంట పంచాయతీ గోగాడవలస సమీపంలో హరిత రహదారిపై అనుమానాస్పదంగా రెండు కార్లు ఉన్నాయని మాతుమూరు ఇంచార్జ్ వీఆర్‌ఓ తమకు సమాచారం ఇచ్చారని తెలిపాడు. ఈ మేరకు పాచిపెంట ఎస్‌ఐ వెంకట సురేష్ సిబ్బందితో ఆ ప్రదేశానికి వెళ్లి కార్లలో గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

యథేచ్ఛగా విక్రయాలు..!

- పాలిథీన్ నిషేధం జరిగేనా..?
- ప్రకటనలకే పరిమితం 'స్వర్ణాంధ్రా – స్వచ్ఛాంధ్రా'
- భారీగా పెరిగిన ప్లాస్టిక్ వినియోగం
- జిల్లాలో ఏటా వేల టన్నుల చెత్త ఉత్పత్తి

జిల్లాలో జనాభా సంఖ్య: **9.25** లక్షల మంది
జిల్లాలో కుటుంబాల సంఖ్య : **2.50** లక్షలు
పాలిథిన్ కవర్లు రోజుకు **1** చొప్పున వినియోగిస్తే : **2.50** లక్షలు
నెల రోజుల్లో వినియోగించేవి : **75** లక్షలు
ఏడాదిలో మొత్తం కుటుంబాలు వాడేవి ప్లాస్టిక్ సంచులు : **9** కోట్లు

వీరఘట్టం: స్వర్ణాంధ్రా – స్వచ్ఛాంధ్రా కార్యక్రమంలో భాగంగా పల్లెలు, పట్టణాలు, నగరాల్లో పారిశుధ్య పరిరక్షణకు అధికార యంత్రాంగం కార్యచరణ చేపట్టింది. ఇందులో భాగంగా ప్రతీ నెలా మూడో శనివారం పారిశుధ్య పరిరక్షణ, ప్లాస్టిక్ వస్తువుల వినియోగం, నిషేధిత పాలథీన్ కవర్లు వినియోగంతో కలిగే అనర్థాలు, మానవాళి మనుగడకు కలిగే ముప్పుపై అధికారులు, సిబ్బంది ముమ్మర ప్రచారం చేస్తున్నారు. అయితే ఈ ప్రచారం ప్రకటనలకే పరిమితమౌతోంది. జిల్లాలో యథేచ్ఛగా పాలిథీన్ సంచుల వినియోగం సాగుతోంది. అదుపు చేయాల్సిన పంచాయతీ, నగర పంచాయతీ, పురపాలక అధికారులు కఠిన చర్యలకు ఉపక్రమించటం లేదు. అప్పుడప్పుడూ తనిఖీలు చేసి ఒకరిద్దరికి అపరాధ రుసుము విధించి ఊరుకుంటున్నారు. ఫలితంగా వాడకం భారీగా పెరుగుతోంది. ఆ వ్యర్థాలు చెత్తలో కలిసి మానవాళి ఆరోగ్యంపై పెను ప్రభావం చూపుతోంది.

జిల్లాలో నియోజకవర్గాల వారీగా చెత్త ఉత్పత్తి	
నియోజకవర్గం	చెత్త ఉత్పత్తి మెట్రిక్ టన్నుల్లో(రోజుకు)
పార్వతీపురం	25
పాలకొండ	10
సాలూరు	12
కురుపాం	5
మొత్తం	52

జిల్లాలో ఏటా వేల టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. ఇందులో ప్లాస్టిక్ వాటా అంతా ఇంతా కాదు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గ కేంద్రాల్లో ప్రతీ రోజు 52 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. అయితే చెత్త శుద్ధిపై తీసుకుంటున్న చర్యలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి.

పాలథీన్ కవర్లు వల్ల మనుషులకు అనారోగ్యం, క్యాన్సర్, బ్రాంకైటీస్, జీర్ణకోశ, శ్వాసకోశ, చర్మవ్యాధులు సంక్రమిస్తాయి. పశువులకు జీర్ణాశయంలో చేరి సంబంధిత ఇబ్బందులు కలుగుతాయి.

ధరణికి

భూమి పొరల్లో చేరి నీరు ఇంకకుండా చేస్తాయి. చెరువులు, నదుల్లోనూ చేరి చేపలు, ఇతర జీవరాశులకు ప్రమాదకరంగా మారతాయి. ప్లాస్టిక్‌ను కాల్చితే వాటి నుంచి రసాయనాలు విడుదలై పర్యావరణానికి హాని కలిగిస్తాయి.



ఇదీ పరిస్థితి

పాలకొండ పట్టణంలో కొన్నాళ్ల వరకు ప్లాస్టిక్‌పై నిషేధం విధించినా.. తర్వాత అధికారులు పట్టు సడలించటంతో మళ్లీ మొదటికి వచ్చింది. గతంలో 50 కేసులు నమోదు చేసి సుమారు రూ.40 వేలు అపరాధ రుసుము వసూలు చేశారు. తర్వాత ఈ అంశంపై పటిష్ట చర్యలు చేపట్టకపోవడంతో పాలకొండలో పాలథీన్ నిషేధం అటకెక్కింది. పార్వతీపురం పట్టణంలో వీటి వినియోగం భారీగా ఉంటోంది. మొత్తం చెత్త ఉత్పత్తిలో 30–40 శాతం భాగం దీనిదే. ఇప్పటి వరకు కేవలం 45 కేసులు నమోదు చేసి రూ.85 వేలు మాత్రమే అపరాధ రుసుం విధించటం దీనికి తార్కాణం. అయినా ప్లాక్టిక్ వినియోగం తగ్గలేదు. కురుపాం నియోజకవర్గానికి ఒడిశా నుంచి భారీగా పాలథీన్ సంచులు, తదితరాలు చేరుకుంటున్నాయి. పాలథీన్ నిషేధంలో సాలూరు నగర పంచాయతీలో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ప్లాస్టిక్ అమ్మకాలపై కఠిన చర్యలు చేపడితే, వినియోగం క్రమేపీ తగ్గుతుందని పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు.

ప్రజలు సహకరించాలి



ప్లాస్టిక్ చేతి సంచులు, కవర్లు నగరంలో నిషేధించాం. ప్రజలు తమ వంతు సహకారం అందించాలి. వ్యాపారులు పర్యావరణానికి హాని చేకూరని చేతి సంచులను విక్రయించాలి. ప్రజలు గుడ్డ చేతి సంచుల వినియోగించి ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సహకరించాలి.
– శ్యామ్ ప్రసాద్, కలెక్టర్, పార్వతీపురం మన్యం

కఠిన చర్యలు తప్పవు



ప్లాస్టిక్ సంచుల వాడకం తగ్గించాలి. వాడిన వాటిని చెత్త కుప్పల్లో, కాలువల్లోకి వదిలేస్తున్నారు. నిషేధం పక్కాగా అమలు చేస్తాం. స్వర్ణాంధ్రా–స్వచ్ఛాంధ్రా కార్యాక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు పక్కాగా చర్యలు చేపడతాం.
– టి.జయరాం, నగర పంచాయతీ కమిషనర్,పాలకొండ

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం..



నిషేధిత ప్లాస్టిక్ సంచుల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై తరచూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్లాస్టిక్ సంచులు విక్రయించే వ్యాపారులతో కూడా మాట్లాడాం. నిషేధిత ప్లాస్టిక్ సంచులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు.
– బి.వెంకటరమణ, ఎంపీడీఓ, వీరఘట్టం

బాడీ బిల్డింగ్ పోటీలకు సిద్ధం



బాడీ బిల్డింగ్ పోటీల వేదిక

పార్వతీపురం టౌన్: జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డుల గల ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఆదివారం జరగనున్న 31వ మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీలకు రంగం సిద్ధమైంది. ఆర్నాల్డ్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరగనున్నాయి. రెండోసారి మన్యం జిల్లా కేంద్రంలో రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించనుండడంతో పోటీదారుల్లో ఆసక్తి నెలకొంది. రాష్ట్రంలో అన్ని జిల్లాల నుంచి 200 మంది బాడీ బిల్డర్లు పోటీ పడనున్నట్టు నిర్వాహకులు హరిశంకర్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 31వ మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీలను నిర్వహించేందుకు అసోసియేషన్ సభ్యులు ఏర్పాట్లు చేశారని తెలిపారు. పోటీలకు సంబంధించి 16 మంది న్యాయ నిర్ణేతల నిర్ణయం తుది తీర్పుగా భావించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే వివిధ జిల్లాల నుంచి వచ్చిన పోటీదారులకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

పది మూల్యాంకనం నుంచి మినహాయింపు ఇవ్వాలి

- డీఈఓకి పీఆర్‌టీయూ జిల్లా కమిటీ వినతి



వినతిపత్రంలో సమస్యలను పరిశీలిస్తున్న డీఈఓ మాణిక్యంనాయుడు

విజయనగరం అర్బన్: పదో తరగతి వార్షిక పరీక్షల మూల్యాంకనం విధుల్లో మినహాయింపు కోరిన ఉపాధ్యాయులకు అనుమతి ఇవ్వాలని పీఆర్‌టీయూ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. జిల్లా కమిటీ సభ్యులు ఈ మేరకు శనివారం డీఈఓ యు.మాణిక్యంనాయుడుని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. పదో తరగతి సబ్జెక్టు టీచర్లను మూల్యాంకనం విధుల్లో వేసినపుడు తొలిత ఆసక్తి ఉన్న వారిని ఎంపిక చేయాలని కోరారు. ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి అనుమతి ఇస్తూ ఇంకా అవసరం ఉన్న పరిస్థితులను గుర్తించిన తరువాతే తప్పనిసరి విధులుగా కేటాయించాలని సూచించారు. జిల్లా కేంద్రంలో చేపడుతున్న సీనియారిటీ అభ్యంతరాలను సమర్పించడానికి గడువు పెంచాలని కోరారు. డీఈఓని కలిసిన వారిలో జిల్లా అధ్యక్షులు డి.శ్రీనివాస్, ఉత్తరాంధ్ర మీడియా ఇన్‌చార్జ్ బంకపల్లి శివప్రసాద్, పట్టణ కమిటీ అధ్యక్షుడు చిట్టి రామునాయుడు, రావాడ రామకృష్ణ, రెడ్డి శంకర రావు, లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

ఆరోగ్యశ్రీ రోగికి డబ్బుల చెల్లింపు



గోవిందకు డబ్బులు అందినట్టు పత్రాన్ని తీసుకుంటున్న ఆరోగ్యశ్రీ టీమ్ లీడర్ జనార్దనరావు, మురళీధర్

సాక్షి ఎఫెక్ట్

విజయనగరం ఫోర్ట్: ఆరోగ్యశ్రీ (ఎన్టీఆర్ వైద్యసేవ) పథకం వర్తించినప్పటికీ రోగుల నుంచి ఇంప్లాట్స్ పేరిట అదనపు వసూళ్లకు పాల్పడుతున్న వైనంపై ఈ నెల 17న సాక్షిలో 'ఆరోగ్యశ్రీ రోగుల నుంచి అదనపు వసూళ్లు' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆరోగ్యశ్రీ అధికారులు స్పందించారు. పట్టణంలోని గాయత్రి ఆస్పత్రిలో వెన్నుపూస శస్త్రచికిత్స చేసుకున్న రోగి గోవింద నుంచి సిబ్బంది రూ. 25 వేలు వసూలు చేశారు. ఆరోగ్యశ్రీ టీమ్ లీడర్ జనార్దనరావు, ఆరోగ్యమిత్ర మురళీధర్ ఆస్పత్రి ప్రతినిధుల నుంచి రూ. 25 వేలు వసూలు చేసి బాధిత వ్యక్తికి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ రోగుల నుంచి అదనపు వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

డయేరియా బాధితులకు ఆర్థిక సాయం

- పది మంది మృతుల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున అందజేత



డయేరియా బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న జనసేన నాయకులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం/గుర్ల: డయేరియా ప్రబలి గత ఏడాది అక్టోబరులో 13 మంది ప్రాణాలు కోల్పోతే వారిలో పది మంది తాలూకు కుటుంబసభ్యులకు మాత్రమే జనసేన పార్టీ ఆర్థిక సాయం అందింది. ఐదు నెలల కిందట గుర్లలో పర్యటన సందర్భంగా ఆ పార్టీ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గుర్ల డయేరియా మృతుల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు గుర్లలో శనివారం నెల్లిమర్ల ఎమ్మెల్యే (జనసేన) లోకం నాగ మాధవి, ఆమె భర్త లోకం ప్రసాద్ ఆధ్వర్యంలో చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్, ఎంఎస్‌ఎంఈ చైర్మన్ టి.శివశంకర్ పాల్గొన్నారు.

గుర్ల అంటే గుర్లలో వారికి మాత్రమే...

గత ఏడాది అక్టోబరులో గుర్ల మండల కేంద్రంతో పాటు సమీపంలోని కోటగండ్రేడు, నాగళ్లవలస గ్రామాల్లోనూ డయేరియా విజృంభించింది. దీంతో గుర్లలో పది మంది, కోటగండ్రేడులో ఒకరు, నాగళ్లవలసలో ఇద్దరు చనిపోయారు. కానీ కూటమి ప్రభుత్వం కోటగండ్రేడుకు చెందిన మరడాన అప్పలనర్సమ్మ ఒక్కరే డయేరియా కారణంగా చనిపోయారని ప్రకటించి చేతులు దులుపుకుంది. వైఎస్సార్‌సీపీ తరఫున రూ.2 లక్షల చొప్పున 13 మంది కుటుంబసభ్యులకు ఆర్థిక సాయం చేస్తామన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు గత ఏడాది నవంబరు 26న శాసనమండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడైన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) చెక్కులు అందజేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు జనసేన తరఫున కేవలం పది మంది కుటుంబాలకు మాత్రమే ఆర్థిక సాయం అందించారు. కూటమి ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన డయేరియా మృతురాలు అప్పలనర్సమ్మ కుటుంబాన్ని జనసేన విస్మరించడం గమనార్హం. పవన్ కళ్యాణ్ గుర్ల అన్నారని, ఆ గ్రామంలోని పది మంది కుటుంబాలకు మాత్రమే చెక్కులిచ్చి సరిపెట్టడం చర్చనీయాంశమైంది.

పీఎం ఇంటర్న్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవాలి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ కార్యక్రమానికి నిరుద్యోగ యువత ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోరారు. దీనికి సంబంధించి విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పది ఆపై తరగతులు ఉత్తీర్ణులైన వారంతా ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో ఎంపిక చేసిన 550 పరిశ్రమల్లో వీరికి శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి కమిటీ సమావేశం కలెక్టరేట్ చాంబర్లో శనివారం జరిగింది. ముందుగా జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ యువత నైపుణ్యాన్ని పెంచేందుకు, ఉపాధి కల్పించేందుకు జిల్లాలో తీసుకున్న చర్యలను వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యువత నైపుణ్యాన్ని పెంచేందుకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహించి పెద్ద ఎత్తున ఉపాధి కల్పించాలని ఆదేశించారు. వివిధ ప్రభుత్వ కార్యక్రమాలను సమీక్షించారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ ఎ.కళ్యాణ చక్రవర్తి, సీపీఓ పి.బాలాజీ, మెప్మా పీడీ చిట్టిరాజు, జిల్లా ఉపాధి అధికారి అరుణ తదితర అధికారులు పాల్గొన్నారు.

పనస చెట్లను విరివిగా పెంచాలి

బొబ్బిలి వీణల తయారీకి ఉపయోగించే పనస కలప కొరత ఉందని, దీనిని నివారించేందుకు విస్తృతంగా పనస చెట్లను పెంచాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సూచించారు. పనస నర్సరీలను ఏర్పాటు చేయాలని ఇప్పటికే అటవీ శాఖకు ఆదేశించడం జరిగిందని చెప్పారు. ఉపాధి హామీ, కన్వర్జెన్సీ పనులు, పల్లె పండగ, ఉల్లాస్ పరీక్ష తదితర అంశాలపై ఎంపీడీఓలు, ఏపీఓలు, పీఆర్ ఇంజనీర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఫారమ్ పాండ్స్ తవ్వడానికి జిల్లాలో శనివారం నుంచి ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించినట్లు చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి డ్వామా పీడీ ఎస్.శారదాదేవి, పంచాయితీరాజ్ ఎస్ఈ ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రొయ్యల చెరువులో దిగి యువకుడి మృతి

గుమ్మలక్ష్మీపురం: రాజమండ్రి సమీపంలోని పాలకొల్లులో రొయ్యల చెరువులో పనికి వెళ్లిన గిరిజన యువకుడు మండంగి కిరణ్ (25) రొయ్యల చెరువులో దిగి శనివారం మృతి చెందినట్లు సమాచారం. ఈ మేరకు తల్లిదండ్రులు లక్కమ్మ, శంకరరావు ఇతర కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. గుమ్మలక్ష్మీపురం మండలంలోని వనకాబడి పంచాయతీ వండిడి గ్రామానికి చెందిన కిరణ్ కుటుంబ పోషణ నిమిత్తం రొయ్యల చెరువులో పని చేసేందుకు రెండు నెలల క్రితం వెళ్లాడు. రొయ్యల చెరువులో కర్రలు పాతాలంటూ యజమాని చెప్పడంతో శనివారం చెరువులో దిగాడు. ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడంటూ.. పోస్టుమార్టం నిర్వహించాల్సి ఉంది రావాలంటూ పాలకొల్లు నుంచి తమకు ఫోన్ వచ్చిందని తెలిపారు.

ఒడిశా ఆగడాలపై తహసీల్దార్‌కు ఫిర్యాదు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కొటియా గ్రామాల గిరిజనులు

సాలూరు రూరల్: ఒడిశా ప్రభుత్వం కొటియా గ్రామాల గిరిజనులపై చేస్తున్న దౌర్జన్యాన్ని నిలువరించాలని తహసీల్దార్ రమణమూర్తికి ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజనులు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల కమిటీ సభ్యుడు తాడంగి సన్నం, బాధిత గిరిజనుడు తాడంగి భీమ మాట్లాడుతూ కొటియా గిరిజన గ్రామాల గిరిజనుల భూములను ఆక్రమించి కంచె వేస్తున్న ఒడిశా అధికారులను ఆంధ్రా అధికారులు అడ్డుకోవాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చిన పోడు పట్టా భూముల్లో దౌర్జన్యంగా కంచె వేస్తుంటే అడ్డుకున్న గిరిజనులపై ఒడిశా అధికారులు దౌర్జన్యం చేస్తున్నారని తెలిపారు. తమపై ఒడిశా అధికారులు దౌర్జన్యం చేస్తుంటే ఆంధ్రా అధికారులు పట్టించుకోవడం లేదని గిరిజనులు వాపోయారు. కొటియా గ్రామాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరారు.

ఉగాది కాదు.. ఇది కూటమి దగా!



దేవరాజు

శృంగవరపుకోట : రానున్న ఉగాది వలంటీర్లకు కూటమి ప్రభుత్వం చేసే దగా.. అని ఏపీ గ్రామ వార్డు వలంటీర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దేవరాజు అన్నారు. శనివారం ఆయన సాక్షితో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎన్నికల వేళ వలంటీర్ల వ్యవస్థను పటిష్టం చేస్తామని, రూ.10వేల వేతనం ఇస్తామని ఇప్పుడు మాట తప్పారన్నారు. ఎన్నికల్లో గెలుపొందాక వలంటీర్ల వ్యవస్థకు చట్టబద్ధత లేదని మాట మార్చారన్నారు. కూటమి సర్కారును నిలదీసేందుకు ఈ నెల 30వ తేదీన ఆందోళన కార్యక్రమానికి సిద్ధం కావాలన్నారు. బాబు అధికారంలోకి వచ్చాక వలంటీర్ల వ్యవస్థపై గొడ్డలి వేటు వేశారన్నారు.

చికెన్	బ్రాయిలర్	లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
		₹105	₹180	₹190

సాక్షి సండే క్లాసిఫైడ్స్

FLAT FOR SALE
■ FLATS for sale 2BHK, 1150 SFT 3BHK, 1700 SFT At Phool Bagh Colony, Vizianagaram. Call 70757 37797 for more details and site visit. [HA-09943]

PLOT FOR SALE
■ 6 లక్షలకే 111 గజాల స్థలం, GVMC పరిధి లేఅవుట్‌లో 30 బిట్లు కలవు. చుట్టూ ఇల్లులు, షాపులు, మార్కెట్ అన్ని సౌకర్యాలు. EMI కలదు. ఫోన్ : 80196 24319 [V- 823977]

పండ్లతోట అమ్మకము
■ తిరుపతి జిల్లా ఓజిల్ మండలం ఆర్మేనుపాడు గ్రామంలో 133 ఎకరముల పండ్లతోట అమ్మకమునకు కలదు సంప్రదించండి : 94401 83778 [SCA25002282]

ASTROLOGY
■ శ్రీ గాయత్రి జోతిష్యం: గత 25 సం॥లుగా VZMలో స్థిరపడి ఉన్నారు. విద్య, ఉద్యోగం, వివాహం, సంతానం, ఆరోగ్యం మీకు ఎటువంటి సమస్యలు ఉన్న జోతిష్యం చెప్పబడును. సెల్: 97017 78711. [V-2171]

HEALTH CARE
■ డా॥ నిర్మల వంగపండు MD, Gen, Med (DM-Neuro) Jimper మెదడు, నరములు, వెన్నెముక వ్యాధి నిపుణులు. ఆదివారం నుండి శుక్రవారం వరకు 9am to 6pm చూసెదరు. నిర్మల న్యూరో & జనరల్ మెడికల్ సెంటర్, VZM, Appointment . ఫోన్ : 63054 71147 [V- 2158]

WANTED
■ విజయవాడలో A/c & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/c టెక్నీషియన్స్-3, దోస్త్ డ్రైవర్లు-3, హెల్పరు-5, 30 సం.లోపు జీ: 18-25,000 ట్రైనింగ్/భోజనం/వసతి ఫ్రీ ✆ 90300 44622 [B-1266928]

■ ఉద్యోగ అవకాశం విజయనగరం లోకల్ గోల్డెన్ వెంచర్స్ వారి నూతన హౌసింగ్ ప్రాజెక్టు మార్కెటింగ్ చేయుటకు యువతీ యువకులు టెలీకాలర్స్ 5, మార్కెటింగ్ మిత్రులు 10, అకౌంటెంట్ 1, టీం ఉన్న లీడర్‌కు మంచి ప్రాధాన్యం కలదు. మంచి జీతం, భోజనం, కమీషన్. అనుభవం లేని వారికి ట్రైనింగ్ ఇవ్వబడును. 7569325969, 8688796746 [SCA 25002253]

■ మీ ఇంటి వద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి, న్యూ రికార్డులు వ్రాయుటకు స్త్రీ, పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం: 12,000. సంప్ర॥ 80084 01243. [V- 6691]

■ వైజాగ్‌లోని ప్రముఖ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో వృద్ధులకు 24 గంటలు సేవ చేయుటకు M/F, వంట మనుషులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. ఫోన్ : 99899 93756 [V-34]

■ మీ ఇంటివద్దనే వుంటూ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 25-30వేలు వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్: 95504 67459. [SCA 25002346]

■ కష్టలేన్ని కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40వేలు,ఫ్రీ రూం+భోజనం.HYD. 7995365999 [HA-141]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కెనరా బ్యాంక్ Canara Bank
ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్ (13591), విశాఖపట్నం
మెలోడీ సినిమా థియేటర్ ఎదురుగా, సూర్యాభాగ్, విశాఖపట్నం-530020,
ఫోన్: 8332956773, 7095199455, ఇ-మెయిల్: cb13591@canarabank.com

స్థిరాస్తుల అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) & 9(1) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన. కెనరా బ్యాంక్ ఎ.ఆర్.ఎం బ్రాంచ్ విశాఖపట్నం వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీత(లు)/హామీదారు(లు) చెల్లించవలసిన బకాయి మొత్తంను రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్ అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/భౌతిక స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టిన/ఛార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను తేది 10.04.2025 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు మరియు హామీదారులకు తెలియజేయడమైనది. బ్యాంకు వారి పరిజ్ఞానం మేరకు తాకట్టు ఋణభారాలు లేని స్థిరాస్తుల వివరములు.

ఇ-వేలం తేది & సమయం: 10.04.2025, మ॥ 3.00 గం.ల నుండి సా॥ 4.00 గం.ల వరకు (అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)
ధరావత్తు సమర్పించుటకు ఆఖరి తేది: 10.04.2025, ఉదయం 11.00 గం॥ల లోపు

వ. నెం	ఋణగ్రహీత / హామీదారులు (అన్ని ఖాతాలు ఎ.ఆర్.ఎం బ్రాంచ్ విశాఖపట్నంకు బదిలీ చేయడమైనవి)	బకాయి మొత్తం	తనఖాలో ఉన్న ఆస్తి వివరములు	రిజర్వు ధర	ఇ.ఎం.డి (రిజర్వు ధరలో 10%)
1	M/s మారుతీ బ్రిక్ ఇండస్ట్రీస్, ప్రొపైయిటర్: మువ్వాడ సత్యవతి మరియు హామీదారు: శ్రీ మువ్వాడ దుర్గ రాజు	రూ. 63.26 లక్షలు	విజయనగరం జిల్లా, గుడివినిగరం మండలం, సీతారామపురం గ్రామ పంచాయితీ, శ్రీ సాయి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రక్కన సర్వే నెం. 150- 3,5,6,7,9,11,12 నందు శ్రీ మువ్వాడ దుర్గా రాజు పేరున గల 4305.60 చ॥గ॥ ఫ్యాక్టరీ స్థలంతో అందులోని ఫ్యాక్టరీ బిల్డింగ్, హద్దులు డీడ్ ప్రకారం.	రూ. 43.01 లక్షలు	రూ. 4.31 లక్షలు

ఆస్తి తనిఖీ తేది & సమయం: 07.04.2025, ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥4.00 గం॥ల వరకు.
అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనలకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్ ఎ.ఆర్.ఎం బ్రాంచ్, విశాఖపట్నం అధీకృత అధికారి గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 8332956773, 7095199455.

రిజర్వు ధరలో 10% ధరావత్తును ఆర్.టి.జి.ఎస్/నెఫ్ట్/ఫండ్ ట్రాన్స్‌ఫర్ ద్వారా కెనరా బ్యాంక్, ఎ.ఆర్.ఎం, విశాఖపట్నం బ్రాంచ్ వారి ఖాతా నెం. 209272434, ఐ.ఎఫ్.ఎస్.సి కోడ్: CNRB0013591 కు తేది: 10.04.2025, ఉ॥ 11:00 గం.ల లోపుగా చెల్లించవలెను.
* బ్యాంకుకు తెలిసిన/తెలియని బకాయిలు/టాక్స్‌లు ఏవైనా ఉన్నచో అవి వేలం కొనుగోలుదారే భరించాలి మరియు తుది బిడ్ మొత్తంతోపాటు అవి కూడా చెల్లించవలసి ఉంటుంది. బిడ్డర్లు తమ ఆఫర్‌లను, ఆస్తి రిజర్వు ధర 25 లక్షల వరకు ఉన్నవాటికి రూ. 10,000/- గుణింపులో హెచ్చించవలెను. రిజర్వు ధర 25 లక్షల నుండి 100 లక్షల వరకు ఉన్నవాటికి రూ. 25,000/- గుణింపులో హెచ్చించవలెను మరియు రిజర్వు ధర 100 లక్షల కన్నా ఎక్కువ ఉన్నట్లయితే రూ. 50,000/- గుణింపులో హెచ్చించవలెను. 'ఆన్‌లైన్' వేలం ముగిసేలోపు అత్యధిక బిడ్ (రిజర్వు ధర కన్నా ఎక్కువ) సమర్పించిన బిడ్డర్ విజయవంతమైన బిడ్డర్‌గా ప్రకటించబడతారు.
ఇ-వేలం విధానం, నియమ నిబంధనల కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పీఎస్‌బి అలయన్స్ (baanknet), వెబ్‌పోర్టల్ https://baanknet.com, హెల్ప్‌డెస్క్: 7046612345/6354910172/8291220220/9892219848 / 8160205051, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com

తేది: 20.03.2025, ప్రదేశం: విశాఖపట్నం
సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్